నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, ఆదివారం 17 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI

మోగిన లోక్‌సభ నగారా

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన ఈసీ

- మే 13న పోలింగ్
- ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల
- 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- 29న అభ్యర్థుల తుది జాబితా
- జూన్ 4న ఓట్ల లెక్కింపు
- అమల్లోకి ఎన్నికల కోడ్
- అభ్యర్థుల ఎంపికలో రాజకీయ పార్టీల తలమునకలు

నల్లగొండ ప్రతినిధి, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. శనివారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేస్తూ ఏడు విడతల్లో ఎన్నికలను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. అందులో భాగంగా నాలుగో విడుతలో రాష్ట్రంలో పోలింగ్ జరుగనున్నది. వచ్చే నెల 18న నోటిఫికేషన్ వెలువరించి అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. పరిశీలన, ఉపసంహరణ అనంతరం 29న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. ఆ తర్వాత సరిగ్గా 14 రోజుల్లో పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థులను త్వరగా తేల్చితే ఆయా రాజకీయ పార్టీల ప్రచారానికి కావాల్సినంత సమయం దొరుకుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. షెడ్యూల్‌తో పాటే ఎన్నికల కోడ్ కూడా అమలులోకి రాగా, పకడ్బందీగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది.

పార్లమెంట్ ఎన్నికల సమర భేరీ మోగింది. మొత్తం 7 దశల్లో దేశమంతటా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూల్ ప్రకటించింది. నాలుగో విడుతలో రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. వచ్చే నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తూ అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ జరగనుంది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి నల్లగొండలో, భువనగిరి లోక్‌సభ స్థానానికి భువనగిరిలో నామినేషన్లను స్వీకరించనున్నారు. ఏప్రిల్ 25 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. మర్నాడు పరిశీలన చేస్తారు. 29 వరకు ఉపసంహరణకు అవకాశం కల్పిస్తూ అదేరోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను వెల్లడిస్తారు. ఆ రోజు నుంచి సరిగ్గా 12 రోజులు ప్రచారానికి గడవు ఉంటుంది. మే 13న పోలింగ్ జరుగుతుంది. అనంతరం స్ట్రాంగ్ రూమ్స్‌లో ఈవీఎంలను భద్రపరిచి జూన్ 4న దేశ వ్యాప్తంగా ఒకేసారి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూన్ 6 వరకు ఎన్నికల ప్రక్రియ ముగియనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. కాగా, నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 17,18,954 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు.

82రోజుల పాటు కోడ్

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు, మంత్రుల అధికారిక పర్యటనలకు బ్రేక్ పడింది. దాదాపు 82 రోజుల పాటు సుదీర్ఘంగా ఎన్నికల కోడ్ అమలులో ఉండనున్నది. గతంలో ఎన్నడూ ఇంత కాలం కోడ్ కొనసాగిన సందర్భాలు లేవనే చెప్పవచ్చు. కోడ్ అమలులోకి రావడంతో ఎక్కడికక్కడ నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు పలు బృందాలు విధుల్లో ఉండనున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం పార్టీల పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులు, ప్రచార సామగ్రిని తక్షణమే తొలగించేలా రంగంలోకి దిగారు. నగదు బదిలీ, రవాణాపై తీవ్ర ఆంక్షలు కొనసాగనున్నాయి.

పార్టీల కసరత్తు ముమ్మరం..

ఇప్పటికే లోక్‌సభ ఎన్నికలపై కసరత్తు చేస్తున్న రాజకీయ పార్టీలు మరింత దూకుడును ప్రదర్శించనున్నాయి. అభ్యర్థుల ఎంపికపైన సందిగ్ధత కొనసాగుతుంది. బీజేపీ ఇప్పటికే నల్లగొండకు శానంపూడి సైదిరెడ్డిని, భువనగిరికి డాక్టర్ బూర నర్సయ్యను తమ అభ్యర్థులుగా ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ నల్లగొండకు కుందూరు రఘువీర్‌రెడ్డిని ప్రకటించి భువనగిరిపై సస్పెన్స్‌ను కొనసాగిస్తున్నది. ఇక బీఆర్ఎస్ అభ్యర్థులపై త్వరలోనే స్పష్టత రానున్నది. భువనగిరి నుంచి సీపీఎం కూడా బరిలో నిలువనున్నట్లు ప్రకటించింది. మిగతా పార్టీలు కూడా కసరత్తును ముమ్మరం చేస్తున్నా రెండు లోక్‌సభ స్థానాల్లోనూ ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉండనున్నది. అభ్యర్థుల ఎంపికపై స్పష్టత వస్తే ప్రచారానికి కావాల్సినంత సమయం దొరకనున్నది. కాగా, గత ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు స్వల్ప తేడాతో బీఆర్ఎస్ అభ్యర్థులపై విజయం సాధించారు.

డీఎస్సీ- ఎస్జీటీకి ఉచిత శిక్షణ

నల్లగొండ, మార్చి 16 : బీసీ స్టడీ సర్కిల్ నల్లగొండ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులకు డీఎస్సీ – ఎస్జీటీ పోటీ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 22వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజర్వేషన్ ప్రకారం ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి ఈ నెల 26నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన డీఎస్సీ ఎస్జీటీ మరియు స్కూల్ అసిస్టెంట్ పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న బీసీ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్టడీ మెటీరియల్ కోసం అభ్యర్థులు www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 4వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్కూల్ అసిస్టెంట్‌కు సంబంధించి గ్రాడ్యుయేషన్.. బీఈడీ, టెట్ మరియు ఎస్జీటీకి సంబంధించి ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు టీఎస్ బీసీ స్టడీ సర్కిల్ నల్లగొండ లేదా 08682–220007లో సంప్రదించాలని సూచించారు.

అక్రమం.. కుట్రపూరితం

ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై బీఆర్ఎస్ శ్రేణుల మండిపాటు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసనలు
- నల్లజెండాలతో ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు
- పలుచోట్ల ప్రధాని మోదీ దిష్టిబొమ్మల దహనం
- భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్
- దేవరకొండలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సహా పలువురి అరెస్ట్

భువనగిరిలో రాస్తారోకో చేస్తున్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులను ఆందోళన విరమించాలని కోరుతున్న పోలీసులు

నల్లగొండలో మహిళ నిరసన

యాదగిరిగుట్ట పట్టణంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నల్లగొండ ప్రతినిధి, మార్చి16(నమస్తే తెలంగాణ) : భారత జాగృతి సంస్థ కన్వీనర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. శుక్రవారం సాయంత్రం కవిత అరెస్టు విషయం తెలిసిన వెంటనే పలుచోట్ల బీఆర్ఎస్ నేతలు రోడ్లపైకి వచ్చారు. శనివారం ఉమ్మడి జిల్లా అంతటా ఎక్కడికక్కడ ఆందోళనలు నిర్వహించారు. నల్లజెండాలు, నల్ల కండువాలు, బ్యాడ్జీలతో ర్యాలీలు తీసి రోడ్లపై బైఠాయించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు కక్షపూరితంగా అక్రమ అరెస్ట్‌కు పాల్పడిందంటూ మండిపడ్డారు. ప్రధాని మోడీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో నల్లజెండాలతో ర్యాలీగా క్లాక్‌టవర్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడే ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. దేవరకొండలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్‌కు ఎదురుగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఆందోళన చేపట్టారు. ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. తక్షణమే కవితను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో కొనసాగించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. రవీంద్రకుమార్‌సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హాలియాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ట్రైకార్ సంస్థ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీగా ప్రధాన కూడలికి చేరుకున్నారు. అక్కడ రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను తగులబెట్టారు. నందికొండలో గులాబీ నేతలు రాస్తారోకో చేశారు. మిర్యాలగూడలోని ప్రధాన కూడలిలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున ఆందోళనకు దిగాయి. నల్లకండువాలు, బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశాయి. మోడీ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, కవితను విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రావ్ చౌరస్తాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ నేత సూదగాని హరిశంకర్‌గౌడ్ నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టి కవిత అక్రమ అరెస్టును ఖండించాలని నినాదాలు చేశారు. ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సూర్యాపేటలోనూ తెలంగాణ తల్లి చౌరస్తాలో పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆందోళనకు దిగాయి. కవిత అరెస్టును ఖండిస్తూ నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తూ కవితను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మకూర్(ఎస్), చివ్వెంల మండలాల్లోనూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేపట్టారు. కోదాడలోని ఖమ్మం క్రాస్ రోడ్స్‌లో పార్టీ నేతలు, శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. మునగాలలో హైవేపై రాస్తారోకో చేపట్టారు. హుజూర్‌నగర్‌లోని ఇందిరాచౌరస్తాలో జరిగిన నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కవిత అరెస్టుపై నిరసన వ్యక్తం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చేశారు. తిరుమలగిరిలో రాస్తారోకో, మోత్కూరులో ధర్నా, నూతనకల్, నాగారం తదితర మండల కేంద్రాల్లోనూ నిరసనలు కొనసాగాయి. ఆలేరు నియోజకవర్గంలోని ఆలేరు, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, మోటకొండూరు మండలాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఎక్కడికక్కడ ఆందోళనల్లో పాల్గొన్నాయి. ఉమ్మడి జిల్లా అంతటా కవిత అరెస్టు అక్రమం అంటూ బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఎన్నికల ముందు అరెస్టు చేసి రాజకీయంగా లబ్ధి పొందాలన్నదే బీజేపీ లక్ష్యంగా కనిపిస్తున్నదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ ప్రత్యేక రాష్ట్రం సాధించిన కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులను కేసులు, అరెస్టులతో భయపెట్టలేరని హెచ్చరించారు. కవితను భేషరతుగా విడుదల చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

సూర్యాపేటలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

రాజీ మార్గంతో కేసులు పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, మార్చి 16 : రాజీ మార్గంతో కేసులు పరిష్కారమవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు అన్నారు. శనివారం జిల్లాలోని అన్ని కోర్టు ఆవరణల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షుడు జయరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా ప్రజలకు ఉచిత న్యాయం, న్యాయవిజ్ఞానం అందచేయటమే కాకుండా చిన్న చిన్న తగాదాలను రాజీ చేసుకునేందుకే లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ కేసులను పరిష్కరించుకొని కుటుంబ శ్రేయస్సుకు, ఆర్థిక ప్రగతికి తోడ్పడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 8 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేయగా కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్ యంత్రాంగం కృషి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పెండింగు కేసులను పరిష్కరించాలని చేసిన సూచనలకు అనుగుణంగా సంబంధిత అధికారులు కృషి చేశారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 6,278 క్రిమినల్ కేసులు, 9 సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్, టెలిఫోన్ రుణ బకాయిల కేసులు 17, ఎస్‌బీఐ కేసులు 9, ట్రాఫిక్ చలానా కేసులు 3,09,615 కలిపి మొత్తం 3,15,928 కేసులను పరిష్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతీదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగారం అంజయ్య, కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, పీపీలు శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, స్వామి, పద్మజ, ప్రభుత్వ న్యాయవాదులు కేశవరెడ్డి, బాబూరావు, సహాయ న్యాయవాదులు జయపాల్, శంకర్, కక్షిదారులు, పోలీస్ యంత్రాంగం, కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

రామన్నపేట : రాజీ మార్గంతో కేసులను పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి చందన అన్నారు. శనివారం మెగా లోక్‌అదాలత్‌లో భాగంగా పలు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మల్లయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శోభన్‌బాబు, న్యాయవాదులు ప్రభాకర్, మొగిలయ్య, డేవిడ్, వెంకట్‌రెడ్డి, యాదయ్య, దినేశ్, సత్తయ్య, కోర్టు సూపరింటెండెంట్లు గంగాభవాని, శివరాజు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌గా గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 16 : జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా కె.గంగాధర్‌ను నియమిస్తున్నట్లు చీఫ్ సెక్రటరీ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న వీరారెడ్డిని రెండు వారాల క్రితం బదిలీ చేసి ఆయన స్థానంలో ప్రభుత్వం శుక్రవారం బి.రాజేశాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కరోజులోనే రాజేశం స్థానంలో సీసీఎల్ఏలో విధులు నిర్వర్తిస్తున్న గంగాధర్‌కు జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించింది.

బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ

నల్లగొండ, మార్చి 16 : తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అభ్యర్థులకు హైదరాబాద్‌లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో రెండు నెలల నాన్ రెసిడెన్షియల్ ఉచిత ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ద్వారా నిర్వహించే ఈ శిక్షణ పూర్తయిన తర్వాత ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ సౌకర్యం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణకు గ్రాడ్యుయేట్ మరియు 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బీసీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వరకు www.tsbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఈ నెల 31న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి, మార్కుల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు టీఎస్ బీసీ స్టడీ సర్కిల్ నల్లగొండ లేదా 08682–220007లో సంప్రదించాలని సూచించారు.

గోవర్ధనగిరిధారిగా.. సింహారూఢుడిగా..

- భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహస్వామి
- యాదగిరిగుట్టలో వైభవోపేతంగా అలంకారసేవలు
- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక, సంగీత, ధార్మిక కార్యక్రమాలు
- నేడు ఎదుర్కోలు ఉత్సవం

యాదగిరిగుట్ట, మార్చి16 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఆరో రోజులో శనివారం యాదగిరీశుడు గోవర్ధనగిరిధారిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుడి చేతిలో పిల్లనగ్రోవి, ఎడమ చేతి చిటికెన వేలిపై గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన స్వామివారిని పట్టుపీతాంబరాలతో అలంకరించి ప్రధానాలయం తిరువీధుల్లో ఊరేగించారు. ఉత్సవ మండపంలో చతుర్వేదాలు, మూలమంత్రాలు, మూర్తి మంత్రాలు, హోమాలు, సుదర్శన మహామంత్రం, నారసింహ మహామంత్రం, పంచసూక్తాలు, నిత్య లఘు పుర్ణాహుతి, నిత్య పుర్ణాహుతి, వేదాలు, పారాయణాలు, ఇతిహాసాలు గావించారు. పంచసూక్తాలు, ఉపనిషత్‌లు పఠిస్తూ రుత్వికులు, అర్చకులు ముందు నడుస్తుండగా.. భక్తుల గోవింద నామస్మరణ నడుమ వైభవంగా స్వామి వారి సేవ సాగింది. తూర్పు తిరుమాఢవీధుల్లో ప్రత్యేక మండపంలో స్వామివారిని ఆస్థానం చేశారు. స్వామి వారి అలంకారమైన నాలుగు వేదాలు, గోవర్ధనగిరిధారి యొక్క సూక్తులను పఠించారు. దివ్య ప్రబంధంలోని అలంకార వైభవ ప్రాశురాలను పఠిస్తూ స్వామివారి అలంకార విశిష్టతను ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహచార్యులు వివరించారు. స్వామివారికి రాత్రి వేళ దివ్యవాహన సేవ సంప్రదాయం కొనసాగింది. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు నృసింహస్వామిగా అవతరించిన స్వామివారు రాత్రి మృగరాజు సింహవాహనంపై యోగానంద నరసింహస్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారం ఆభరణాలతో తేజోరూపుడైన నారసింహుడిని అడవికి రాజైన సింహ వాహనంపై అధిష్ఠించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రుత్వికుల పారాయణాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధానాలయ తిరుమాఢవీధుల్లో స్వామివారు ఊరేగారు. ఆలయ అర్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వేంకటచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఆగమశాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, యాజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, భాస్కరాచార్యులు, మాధవాచార్యులు, సహాయ కార్యనిర్వహణాధికారి గజవెల్లి రమేశ్‌బాబు, రఘు, గట్టు శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సింహవాహనంపై స్వామివారు

కృష్ణభగవాడి అద్భుత లీల గోవర్ధన గిరిధారి లీల

శ్రీకృష్ణ పరమాత్మ బాల్యలీలలో అపూర్వమైన లీల ఈ గోవర్ధనగిరిధారి లీల అని ఆలయ ప్రధానార్చాకులు నల్లథిఘళ్ లక్ష్మీనరసింహచార్యులు పేర్కొన్నా రు. నంద వ్రజంలోని గోపకులు పంటలు వృద్ధి పొందుటకు గోవర్ధన పర్వతం మీద వర్షాలు కురిపించమని ఇంద్ర యాగం చేస్తున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు ఇంద్రయాగాన్ని నిలిపివేసి గోవులను, బ్రాహ్మణులను, పర్వతాలను పూజించమని చెప్పగా.. గోపకులు అచలవ్రతం ఆచరిస్తారు. దానికి కోపగించిన ఇంద్రుడు నందవ్రజంపై భీకరమైన రాళ్ల వర్షాన్ని కురిపిస్తాడు. దానికి గోపకులు భయపడి శ్రీకృష్ణుడిని ప్రార్థించగా శ్రీకృష్ణ పరమాత్మ వారికి అభయాన్నిచ్చి ఒక చేతిలోతో గోవర్ధన పర్వతాన్ని పైకెత్తి గొడుగులా ఏడు రోజులు ఎత్తిపట్టుకొని గోవులు, గోపాలురను రక్షిస్తాడు. శ్రీకృష్ణుడి మహత్యం తెలిసిన ఇంద్రుడు గర్వాన్ని వదిలి శరణాగతుడై గోవిందుడు అను బిరుదునిచ్చి నిష్క్రమిస్తాడు. స్వామివారు 'అభయం సర్వభూతేభ్యో దదామ్యేతత్ వ్రతం మమ' అని శరణు వేడితే తప్పక రక్షిస్తానని, ఇదే నా వ్రతమని గోవర్ధనగిరిధారి అలంకార సేవలో భక్తులకు దర్శనమిస్తున్నాడని ప్రధానార్చకులు వివరించారు.

ఆలయ మాడ వీధుల్లో గోవర్ధనగిరిధారి అలంకార సేవలో స్వామి వారి సేవ ఊరేగింపు

దుష్టశిక్షణ, శిష్ట రక్షణలో సింహ వాహనారూఢుడైన నరసింహస్వామి..

బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీనరసింహస్వామి సింహ వాహనారూఢుడై భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సింహం కార్యదీక్ష, బుద్ధికుశలత, పరాక్రమం, ధైర్య, గాంభీర్యాధి గుణాలకు ప్రతీక అని ఆలయ ప్రధానార్చకులు వివరించారు. సింహ వాహనం శక్తికీ, శ్రీఘ్రగమనానికీ నిదర్శనమని పేర్కొన్నారు. స్వామివారు రాక్షస స్వభావాన్ని హింసించి(హిరణ్యకశ్యపుని వధించి) సత్యగుణం కలిగిన ప్రహ్లాదుడిని రక్షిస్తాడు. సింహం అరణ్యానికి సంరక్షకుడు. మానవ జీవనం అనే సంసార అర్యణ్యానికి సంరక్షకుడిని తానేనని నరసింహ రూపధారియైన స్వామివారు భక్తులకు దర్శనమిస్తున్నాడని అర్చకులు వివరించారు.

ఆకట్టుకున్న ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు భక్తులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయిశ్రీనివాస భజన మండలి, భువనగిరికి చెందిన శ్రీరామభక్త భజన మండలి, బూడిద సత్తయ్య బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు, యాదగిరిగుట్టకు చెందిన శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాత భేరి, హైదరాబాద్‌కు చెందిన శ్రీమాన్ వింజమూరి విజయకుమారాచార్యులుతో ఉపాన్యాసం, టంగుటూరుకు చెందిన శ్రీపాల రామాంజనేయ భాగవతార్‌తో హరికథ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహతి ఆర్ట్స్ ఆధ్వర్యంలో భక్తి సంగీతం, డాక్టర్ స్వర్ణ మంగళంపల్లి వారి కర్ణాటక సంగీతం, కుమారి నాగదుర్గ, శ్రీ సురభి అకాడమీ ఆఫ్ పెర్ఫార్మింగ్, అంకం శిరీష, లాస్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, మల్కాజిగిరికి చెందిన నృత్య దీక్షాలయం, ఆరుట్ల లక్ష్మీసౌజన్య, కుమారి హరిత కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు స్వామివారి ఎదుర్కోలు..

లక్ష్మీనరసింహస్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం జగన్మోహిని అవతారంలో స్వామివారు దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై ఊరేగనున్నారు. రాత్రి 8.45 గంటలకు ఎదుర్కోలు మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం తూర్పు మాఢవీధుల్లో ఏర్పాట్లు చేశారు. ఎదురెదురుగా ప్రత్యేకమైన వేదికలను ఏర్పాటు చేశారు.